ప్రజాశక్తి
శనివారం 6 మే 2023 | 8 పేజీలు





ప్రకాశం | బాపట్ల

పది వేల టన్నుల

మొక్కజొన్న కొనుగోలుకు ప్రణాళిక

బాపట్ల జిల్లా వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలకులు భాస్కర్

ప్రజాశక్తి బాపట్ల

బాపట్ల జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పది వేల టన్నులు మొక్కజొన్నను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, బాపట్ల జిల్లా వర్ష ప్రభావిత ప్రాంతాల పరిశీలకులు భాస్కర్ తెలిపారు. శుక్రవారం బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషాతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్నప్పటికీ బాపట్ల జిల్లాలో అధిక వర్షాలతో పంట దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలకులుగా ప్రభుత్వం పంపిందన్నారు. అందుకు సంబంధించి అధికారులతో సమీక్షించామన్నారు. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే బాపట్ల జిల్లాలో అధిక వర్షపాతం నమోదైందని, రైతులు ఇబ్బంది పడకుండా పంట నష్టం అంచనా వేసేందుకు అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కుప్పల్లో ఉన్న వరి ధాన్యం వర్షాలకు పెద్దగా దెబ్బతినే అవకాశాలు ఉండవన్నారు. ప్రధానంగా జిల్లాలో మొక్కజొన్నకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను నిల్వ ఉంచేందుకు అవసరమైన



మాట్లాడుతున్న భాస్కర్

గిడ్డంగులు సిద్ధం చేస్తున్నామన్నారు. అందుకు అవసరమైన గోనె సంచులు రైతులకు అందజేస్తున్నామన్నారు. అవసరమైన రైతులు తమ పేర్లు ఆర్బికేల్లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో దెబ్బతిన్న పసుపును పరిశీలించి.. పసుపు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్క్‌ఫెడ్, రెవెన్యూ శాఖల ద్వారా మొక్కజొన్న కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాల నుండి పంటలను కాపాడుకునేందుకు రైతులు వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తుందని తెలిపారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఏర్పడే విపత్తులను, విపత్కర పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సంసిద్ధం చేశామన్నారు.

నీటిలో పంట.. రైతు కన్నీట..

- అకాల వర్షాలతో అన్నదాత కుదేలు
- మొక్కజొన్న, జొన్న, పసుపు, మిర్చి పంటలకు భారీనష్టం
- పట్టలు కప్పినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేసవి కాలంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా బాపట్ల జిల్లాలో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. వర్షాల కారనంగా పంటలకు అపార నష్టం వాటిల్లుతోంది. ప్రధానంగా జిల్లాలోని వేమూరు, రేపల్లె, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో మొక్కజొన్న, జొన్న, పసుపు, మిర్చి, కొంతమేర వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లింది. శుక్రవారం జిల్లాలోని రేపల్లె ప్రాంతంలో 60 మి.మీ.ల మేర వర్షపాతం నమోదైంది.

సాధారణంగా వేసవిలో మేలో ఎండలు అధికంగా ఉంటాయి. ఈ కారణంగా మొక్కజొన్న రైతులు కంకెలు కోసి పొలాల్లో విత్తనాలు ఆరబెట్టుకుంటారు. రబీలో ఒక్క రేపల్లే వ్యవసాయ డివిజన్‌లో దాదాపు 38 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. సుమారు ఆరు వేల ఎకరాల్లో మొక్కజొన్న కోతకు వచ్చి ఉంది. 3500 మంది రైతులకు చెందిన 20 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట వర్షాలకు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. బాపట్ల జిల్లావ్యాప్తంగా అత్యధికంగా మొక్కజొన్న కండెలు కోసి పొలాల్లో ఆరబోసి ఉన్నాయి. గత ఆదివారం నుంచి వర్షాలు కురవడంతో పొలాల్లో ఉన్న కండెలు, ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు పొలాల్లో ఉన్నాయి. పట్టలు కప్పి ఉంచినప్పటికీ వర్షపు నీరు చేరి.. ఫంగస్‌కు గురవుతున్నాయి. రంగు మారిపోతున్నాయి. మిర్చి కూడా కోసి పొలాల్లో ఎండబెట్టి ఉంచారు. ఈ మిర్చి అంతా దెబ్బ తింది. పొలాల్లో ఉన్న పసుపు, జొన్న పంట ఈ అకాలవర్షాల వల్ల దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వేలాది మంది రైతులు రబీ పంటను కోల్పోయినట్లయింది. వ్యవసాయాధికారులు రంగంలోకి దిగి పంట నష్టం అంచనాలు వేయాల్సి ఉంది. 33 శాతం పైగా నష్టం వాటిల్లితేనే పంట నష్టాన్ని పరిగణలోకి తీసుకుంటామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మరి కొన్ని రోజులు వర్షాలు కురుస్తాయని వెల్లడవుతున్న నేపథ్యంలో అకాల వర్షాలకు తడిసి దెబ్బతిన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి.. ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రేపల్లెలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

గతేడాది తామర పురుగుతో..

జిల్లాలోని అద్దంకి, పర్చూరు ప్రాంతాల్లో గతేడాది తామర పురుగుతో మిర్చి పంటకు నష్టం జరగ్గా ఈ సారి అకాల వర్షాల వల్ల నష్టం వచ్చింది. జిల్లాలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటను అకాల వర్షం నట్టేటముంచింది. రేపల్లె ప్రాంతంలో పసుపు పంటకు వర్షాల వల్ల నష్టం వాటిల్లింది.

రాజకీయంగా ఇబ్బందులు పెడుతున్నారు..

- ఎంత కష్టం వచ్చినా వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా..
- నా వ్యక్తిత్వం గురించి టిడిపి వాళ్లు కూడా మంచిగానే చెబుతారు..
- నా ప్రతిష్టను దిగజార్చేవారు ఎవరనే విషయం సిఎంకు చెప్పా..
- తీవ్ర ఆవేదనతో మాట్లాడిన బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'రాజకీయంగా నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నేను టిక్కెట్లు ఇప్పించిన వారితోనే నా మీద సిఎంకు ఫిర్యాదు చేయిస్తున్నారు. సొంత పార్టీ వాళ్లే నా మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. ఒంగోలు నియోజకవర్గంలో సొంత పార్టీలో నాకు ఎవరూ శత్రువులు లేరు. నేను వైఎస్‌ఆర్ కాంగ్రెసుపార్టీ కార్యకర్తల కోసం ఏ త్యాగమైన చేస్తా..వారికి అండగా నిలబడతా.' అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆవేదనతో చెప్పారు. శుక్రవారం ఒంగోలులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయనను ఇబ్బందులకు గురిచేస్తున్న సొంతపార్టీ వ్యక్తులు ఎవరనే విషయం మాత్రం ఆయన స్పష్టంగా చెప్పడానికి ఇష్టపడని ఆయన.. అలాంటి నీచపు వ్యక్తుల పేర్లు తాను చెప్పదలచుకోలేదంటూ మాట దాట వేశారు. పార్టీలో తనకు ఎదురవుతున్న పరిణామాలు పట్ల చాలా బాధగా ఉన్నానని చెప్పారు. 'ఆ మధ్య కాలంలో చైన్నైలో బంగారు వ్యాపారుల డబ్బులు పట్టుబడితే అది తన హవాలా డబ్బులు అని చెప్పారని, నిన్న, మొన్న భూ కబ్జాలు చేస్తున్నానన్నారని, వైజాగ్‌కు చెందిన వ్యక్తులతో, అమెరికాలో ఉన్న పంచ్ ప్రభాకర్‌తో మాట్లాడించారని చెప్పారు. 'తెలంగాణకు చెందిన వ్యక్తి గోనె ప్రకాశరావు నేను వంద కోట్లు సంపాదించాను అంటున్నాడు.. జగన్ జైలుకు పోతాడు, భారతికి నోటీసులు వస్తాయి, అవినాష్‌రెడి ని అరెస్టు చేస్తారు అని మాట్లాడుతున్నాడు. వైవి సుబ్బారెడ్డి దేవుడని కితాబిస్తున్నాడు. కొంతమందిని తిడుతున్నారు, కొంతమందిని పొగొడుతున్నారు. ఎక్కడో తెలంగాణకు చెందిన వ్యక్తి నా గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముంది...? ఆయన చెబుతున్న వందకోట్లు ఎక్కడున్నాయో చెబితే వెళ్లి తెచ్చుకుంటా' అని బాలినేని అన్నారు. వైవి సుబ్బారెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టాడని మాట్లాడుతున్నాడని, తన తండ్రి 1977 నుంచే రాజకీయాల్లో ఉన్నాడని, 1987లో యూత్ కాంగ్రెసులో తన రాజకీయ ప్రస్థానం మొదలైందని చెప్పారు. వైఎస్.రాజశేఖరరెడ్డి తన రాజకీయ గురువని, ఆయనే తనకు రాజకీయ భిక్ష పెట్టారని, తన గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నారో అర్ధం కావడం లేదని అన్నారు. తనపై ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. తన గురించి, తన వ్యక్తిత్వం ▶ 2లో



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు డీఎస్పీగా నారాయణస్వామిరెడ్డి?

అశోక్‌వర్ధన్‌రెడ్డి దర్శికి..?

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఒంగోలు డిఎస్‌పి పోస్టింగ్ విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. అధికారపార్టీ ముఖ్యనేతల సిఫారసులతో పోస్టింగ్ జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే.. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డిఎస్‌పిల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా ఒంగోలు డిఎస్‌పిగా అశోక్‌వర్ధన్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే.. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టగా.. కొన్ని గంటల్లోనే ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో రిలీవ్ అయినట్లు సమాచారం. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఒంగోలు డిఎస్‌పిగా దర్శి డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డిని నియమించే అవకాశం ఉందని సమాచారం. ఆయన స్థానంలో ఒంగోలు డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చిన అశోకవర్ధన్‌రెడ్డిని నియమిస్తారని తెలిసింది. నారాయణస్వామిరెడ్డి ఒంగోలు డిఎస్‌పిగా శనివారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



నారాయణస్వామిరెడ్డి (ఫైల్)



గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మైనింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్

హక్కుల కోసం ఐక్య పోరాటాలు

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. రమేష్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-పొదిలి

ప్రపంచంలో దోపిడీకి గురయ్యే పీడితులకు వర్గ పోరాటమనే ఆయుధాన్ని అందించిన ఘనత కారల్ మార్క్సుదేనని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ 205వ జయంతి, మేడే వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దోపిడీకి గురవుతున్న వారందరూ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడటం ద్వారానే శ్రమకు తగ్గ ఫలితం సాధించుకోగలరన్నారు. పోరాటాల ఫలితంగా 8గంటల పని విధానం, పిఎఫ్ ,బోనస్, గ్రాట్యుటీ, పని ప్రదేశాల్లో సౌకర్యాలు హక్కుగా సాధించుకున్నట్లు తెలిపారు. సంస్కరణల అమలు ప్రారంభమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక హక్కులను హరించి వేస్తున్నట్లు తెలిపారు. కార్మిక హక్కులను కాపాడుకోవటానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.మేడే వారోత్సవాలు, కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా నగర పంచాయతీ కార్మికులకు సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఐవి.రాఘవమ్మ సహకారంతో దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎ.వెంకట్రావు, బి.కోటేశ్వరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర పంచాయతీ కమిటీ అధ్యక్షకార్యదర్శులు జి.నాగులు, డి.సుబ్బయ్య, కెవి.నరసింహం, పి.సుబ్బులు, జి.లీలమ్మ, వి.కుమార్ పాల్గొన్నారు.

రాజకీయంగా ఇబ్బందులు పెడుతున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

గురించి టిడిపి వాళ్లను అడిగినా మంచిగానే చెబుతారని, అలాంటిది సొంత పార్టీ వాళ్లే తనను అప్రతిష్టపాలు చేయాలని చూస్తుండటం చాలా బాధగా ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీ ఆవిర్భావం నుంచి జగన్ వెంటే ఉన్నానని, అంతకు ముందు రాజశేఖరరెడ్డి వెంట నడిచానని, తాను, తన కుటుంబం రాజశేఖరరెడ్డి కుటుంబానికి విధేయులమని చెప్పారు. మూడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసింది..అక్కడ బాధ్యతలు చూడలేకనేన్నారు. సొంత నియోజకవర్గం మీద ఎక్కువ దృష్టి పెట్టాలని సిఎంకు చెప్పానని, ఆయన కూడా సరే అన్నారని చెప్పారు. ఈ విషయం మీద కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తాను జిల్లాలో ఎమ్మెల్యేలను, ఇన్ఛార్జీలను ఎప్పుడు ఇబ్బందీ పెట్టలేదన్నారు. ఏనాడూ ఎవరి మీదా సిఎంకు చెప్పలేదని, అలాంటిది తాను టిక్కెట్లు ఇప్పించిన వారిచేతనే తన మీద సిఎంకు లేనిపోనివి చెప్పిస్తున్నారని, నేను వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీ కోసం ఎంత కష్టపడ్డానో...! ఎన్ని బాధలు పడ్డానో తనకు తెలుసని అన్నారు. ఏమి చేశానని తన మీద నిందలు, ఆరోపణలు చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. అన్ని విషయాలు సిఎంకు చెప్పానని, తన మీద తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై అధిష్టానమే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఆయన మాట్లాడుతున్న సమయంలో ఒక దశలో ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. విలేకర్ల సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, పార్టీ నాయకులు కటారి శంకర్, గంటా రాము పాల్గొన్నారు.

బుక్‌డిపాజిట్ కేంద్రం ప్రారంభం

టంగుటూరు : విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని ఆలకూరపాడు గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాచగర్ల వెంకట సుశీల ఆధ్వర్యంలో బుక్ డిపాజిట్ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కళ్యాణ రావు, బిడిసిఎల్ జిల్లా అధ్యక్షులు కోటయ్య, బిడిసి నిర్వాహకులు పసుమర్తి శ్రీరాములు, ఎంపిటిసి అనూష, లకంతోటి సుబ్బారావు, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ విజేత సిరి హాస్పిటల్ జట్టు

సంతనూతలపాడు రూరల్ : స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఒంగోలు సిరి హాస్పిటల్ క్రికెట్ క్లబ్ జట్టు విజేతగా నిలిచి రూ. 50 వేల నగదును అందుకుంది. ఒంగోలు హెచ్ఎంసిసి ఒంగోలు జట్టు ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు నగదును అందుకుంది. విజేతలకు శుక్రవారం బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుంపా ఇంద్రసేనారెడ్డి, తహశీల్దారు శీలం శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, గ్రామ సర్పంచి దర్శి నాగమణి మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డివి.రమణారెడ్డి, వైసిపి నాయకులు కత్తినేని శ్రీనివాసరెడ్డి దాసరి ఏడుకొండలు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

పామూరు : మండల పరిధిలోని కంబాలదిన్నె గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షులు చల్లా ఆదియ్య గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అందులో భాగంగా లక్ష్మీ నరసాపురం ఎంపిటిసి బొల్లా నరసింహారావు శుక్రవారం ఆదియ్యను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, టిడిపి ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి షేక్ అమీర్ బాబు, పామూరు మాజీ ఎంపిటిసి ఇర్రి కోటిరెడ్డి, కంభాలదిన్నె టిడిపి కోఆర్డినేటర్ గోల్లా వీరబాబు, పామూరు మండల బిసి సెల్ ఉపాధ్యక్షుడు మండ్లా రమణయ్య, ఎంఆర్‌పిఎస్ మండల మాజీ అధ్యక్షుడు శేషం మోసే తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుడు

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాళ స్వామి బ్రహోత్సవాలు వైభవంగా నిర్వ హిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మోహిని ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై శ్రీమన్నారాయణ అలంకరణలో వేణుగోపాలుడు ప్రజలకు దర్శన మిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయల ఇఒ మీనిశెట్టి శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, పంచాయతీ వైస్ ప్రసిడెంట్ పెంట్యాల శ్రీను, మల్లేశ్వరి, ఆలయ సిబ్బంది వేణు, సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

మద్దిపాడు : మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మో త్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా శుక్రవారం మోహిని ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామా నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, అర్చకులు నారాయణ, రవికుమార్, రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడులో ఎన్ఎల్అండ్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్, సెనోగ్రఫీ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ రాఘవేంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎన్ఎల్అండ్ఎస్ ఫౌండేషన్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ మరియు స్టెనోగ్రఫీ శిక్షణ తరగ తులను ఏర్పాటు చేసిన నూతల పాటి నాగేశ్వరరావును అభినందించారు ఈ కార్యక్రమంలో శిక్షకులు ఒకట సుబ్బారావు, కోటయ్య, కోఆర్డినేటర్ బాబూరావు, ఇఒఆర్‌డి. రామకష్ణ, కార్యదర్శి పోతురాజు పాల్గొన్నారు.

నృత్య అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి-పామూరు

విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కళలు కూడా ఎంతో ముఖ్యమని సిఐ కె. శ్రీనివాసరావు తెలిపారు. డ్యాన్స్ మాస్టర్ బొప్పూరి రాజేష్ ఆధ్వర్యంలో దర్గా సెంటర్‌లో ఏర్పాటు చేసిన దీపిక నృత్య అకాడమీని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.సురేష్ యాదవ్, వనిత క్లబ్ అధ్యక్షురాలు బచ్చు ఝాన్సీరాణి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణం చేపట్టకపోతే నోటీసులు

జేసీ శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

జగనన్న కాలనీ లేఅవుట్లల్లో ఇప్పటికీ గృహ నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు సమాధానం చెప్పకపోతే వారి పట్టాలు రద్దు చేయాలని జేసీ కె. శ్రీనివాసులు తెలిపారు. శింగరాయకొండ మండలం సోమరాజు పల్లి పంచాయతీలోని పకీరు పాలెం వద్ద ఉన్న జగనన్న కాలనీని శుక్రవారం జేసీ పరిశీలించారు. అనంతరం వివిధ శాఖలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వెలుగ పథకం ద్వారా రూ.30 వేల రుణం తీసుకున్న వారు కూడా గృహ నిర్మాణం చేపట్టక పోవడం బాధాకరమన్నారు. ఇలా జరుగుతుంటే మీరేమి చేస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. లబ్ధిదారుడి సమాధానం సక్రమంగా లేకపోతే పట్టాను రద్దు చేయాలని తహశీల్దారు ఉషను ఆదేశించారు. అనంతరం జేసీ తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ , పేరయ్య మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ డిఒ జయరావు, ఎఇ నాగరాజు పాల్గొన్నారు. **టంగుటూరు :** జగనన్న లే అవుట్లలో గహ నిర్మాణాలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నప్పటికీ లబ్ధిదారులు ముందుకు రాకపోవడం శోచనీయమని, ఇలాగైతే లబ్ధిదారుల పట్టాలు రద్దు చేయక తప్పదని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు, జిల్లా అధికారులు తెలిపారు. నవరత్నాలు – ప్రజలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో గహ నిర్మాణ లబ్ధిదారులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం జగనన్న లే అవుట్ లలో లబ్ధిదారులకు పట్టాల కేటాయిస్తే ఇప్పటికీ ఇల్లు నిర్మించుకోకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, గహ నిర్మాణ శాఖ ఇఇ ప్రసాద్, పంచాయతీరాజ్ డిఇఇ జెట్టి రవిబాబు, తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు, ఎంపిడిఒ రత్నజ్యోతి, హౌసింగ్, ఆర్ డబ్ల్యుఎస్, విద్యుత్ ఎఇలు పఠాన్ రియాజ్, సుబ్బారావు, కె రామకష్ణ, ఎపిఎం హనుమంతరావు, ఎపిఒ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కొత్తపట్నం : మండల పరిధిలోని మోటుమాల గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి,ఎంపిపి అంజిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పాల్గొని ప్రత్యే పూజలు నిర్వహించారు.

కల్యాణమస్తు, షాదీ తోఫా అందజేత



నమూనా చెక్‌ను అందజేస్తున్న చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, గుంటూరు జడ్పీ చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టినా తదితరులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిరుపేద కుటుంబాలను ఆదుకోవడానికే వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకం లబ్ధిదారులైన నూతన దంపతులకు తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి బటన్ నొక్కి నగదు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని లబ్ధిదారులతో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడగా బాపట్ల మండలానికి చెందిన లబ్ధిదారులైన కాకి కల్పన ముఖ్యమంత్రితో మాట్లాడారు. అనంతరం గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ హెన్రీ క్రిస్టీనా, జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత, శాసనసభ్యులు కోన రఘుపతి చేతుల మీదుగా జిల్లాలోని లబ్ధిదారులైన నూతన దంపతులకు నగదు చెక్కును అందజేశారు. బాల్య వివాహాలు నిరోధించడానికే వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకంలో ఆడ పిల్లలకు పదో తరగతి తప్పనిసరి చేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. నా కుటుంబానికి బంధువుగా నిలిచి ఆర్థికంగా ఆదుకున్నారని బాపట్ల మండలానికి చెందిన లబ్ధిదారులు కాకి కల్పన తన మనోభావాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రితో పంచుకున్నారు. వర్చువల్ ద్వారా కలెక్టరేట్ నుంచి ఆమె సిఎంతో మాట్లాడారు. మీ సహాయం నాకెంతో సంతోషం, ధైర్యాన్నిచ్చింది. 2007లో భర్త చనిపోతే నా ఇద్దరు పిల్లలను పెంచడం, చదివించడం, పోషణ భారమయిందన్నారు. 2019 వరకు వితంతు పింఛను కూడా లేక చాలా ఇబ్బంది పడ్డానని ముఖ్యమంత్రికి వివరించారు. మీ హయాంలో వితంతు పింఛన్ మంజూరైందని, నా పిల్లలను చదివించుకోవడానికి సంక్షేమ పథకాలు ఆదుకున్నాయి. స్తోమత లేక అప్పుచేసి నా కుమార్తెకు పెళ్లి చేశాను. ఇబ్బందులు పడుతున్న సమయంలో నాకు బంధువుగా నిలిచి రూ.ఒక లక్ష నగదు ఆర్థిక సాయంగా అందించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. జిల్లాలో 226 నూతన దంపతులకు రూ.1.80 కోట్ల నగదు విడుదలయిందన్నారు. పేదలకు మేలు చేయడానికి మీరు ఎంతో కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రితో అన్నారు. పేద కుటుంబాలలో వివాహం చేసుకున్నవారికి ఆర్థిక సాయం చేయడం సంతోష దాయకమని గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ హెన్రీ క్రిస్టీనా అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికే వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకంలో మార్పులు తెచ్చారని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత చెప్పారు. పేదలైన ఎస్సీ, ఎస్టీ, బి.సి., ఈ.బి.సి.లకు పారదర్శకంగా పథకాల లబ్ధి చేకూరుస్తున్నారని వివరించారు. పేదరికాన్ని పోగొట్టడమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు వేస్తున్నారని చెప్పారు. పేదలు ఆత్మస్థైర్యంతో బ్రతకడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నగదుతో పాటు నమ్మకాన్ని ఇచ్చారని శాసనసభ్యులు కోన రఘుపతి చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలతో గొప్ప మనసున్న నాయకుడిగా ప్రజలలో నిలిచారన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే నగదు ఇస్తున్నారని వివరించారు. పేద కుటుంబాలు ఏ పరిస్థితుల్లో చితికిపోతున్నాయో గుర్తించి వారికి మేలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సమానత్వం అమలయ్యేలా సమర్థంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి బి అర్జునరావు, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రాజదెబోరా, డిఆర్‌డిఎ అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

బాలలకు సహకారం అందించాలి



బాలికలకు వస్త్రాలను బహూకరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అద్దంకి

నిరాదరణకు గురైన బాలలను గుర్తించి వారికి మనవంతు సహాయ సహకారాలు అందించినప్పుడే మానవ జీవితం ధన్యం అవుతుందని, వారి పట్ల ప్రేమ, ఆదరణ కలిగి ఉండాలని ప్రకాశం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రామ్ మేనేజర్ టి రంగారావు పేర్కొన్నారు. శుక్రవారం అద్దంకిలోని గుర్రాల కాలనీలో పేదరికంతో బాధపడుతున్న అతి చిన్న వయసులోనే తల్లిని కోల్పోయిన 8 నెలల చిన్నారి, నాయనమ్మ సంరక్షణలోని మూడు సంవత్సరాల బాలిక ఆ ఇద్దరు బాలికలను ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంతరణ మండలి స్టేట్ ప్రోగ్రాం ఫీల్డ్ ఆఫీసర్ కె రవికుమార్, ఆంధ్రప్రదేశ్ నియంత్రణ మండలి బాపట్ల ప్రకాశం జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ టి రంగారావు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎన్‌విఎస్ రామ్మోహన్ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి మేదరమెట్ల హెల్ప్ టిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ ఆ చిన్నారి బాలికలకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రకాశం గుంటూరు జిల్లాల ప్రోగ్రాం ఫీల్డ్ ఆఫీసర్ కె రవికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ మేదరమెట్ల టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవి సాగర్, హెల్ప్ మేదరమెట్ల టిఐ, అద్దంకి ఓఆర్‌డబ్ల్యు కరుణ పాల్గొన్నారు.

ఉడుములు పట్టుకున్న వ్యక్తికి రిమాండ్



గిరిజనుడిని అదుపులోకి తీసుకున్న ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మూడు ఉడుములు పట్టుకున్న వ్యక్తికి జైలు శిక్ష పడింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దదోర్నాల మండల పరిధిలోని కొర్రపోలు అటవీ శాఖ కార్యాలయ సరిహద్దులో గల పెద్దమంతనాలలో భూమని పోతన్న అనే చెంచు గిరిజనుడు మూడు ఉడుములను పట్టుకున్నాడు. రెండింటిని చంపడంతో పాటు ఒక దానిని తన వద్దనే ఉంచుకున్నాడు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ ఎఫ్ఆర్వో ప్రసన్నజ్యోతి ఆధ్వర్యంలో చెంచు గిరిజనుడిని అదుపులోకి తీసుకున్నారు. బతికి ఉన్న ఉడుమును నల్లమల అటవీ ప్రాంతంలో వదిలారు. చనిపోయిన రెండు ఉడుములకు ఆత్మకూరు ప్రభుత్వ పశు వైద్యాధికారి జుబేర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచగా రిమాండ్‌కు పంపారు. అటవీ శాఖ సిబ్బంది తానీషా, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర మరమ్మతులతో ప్రజల ఇక్కట్లు



పైపులైన్ మరమ్మతులకు గుంట తీస్తున్న కూలీలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలులో నిరంతరం పైపులైన్‌లు పగిలిపోవటం, లీకేజీలు సంభవించటంతో ప్రజలు తాగునీటికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత మూడు రోజుల క్రితం, పాత ఆంధ్రా బ్యాంక్ సమీపంలో మూడు రోజుల పాటు మరమ్మతుల కోసం గుంటలు తవ్వటంతో ప్రజల రాకపోకలకు మరియు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. నిన్న, మొన్న సంఘటనలే కాకుండా అనునిత్యం లీకేజీ మరమతులతో అటు అధికారులు, ఇటు గ్రామ ప్రజలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం గతంలో కోటి ఇరవై మూడు లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకంలో నెలకొన్న అవినీతికి దర్పణం ఈ లీకేజీలు. ఆనాడు నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం పైపులు వేయటంతోనే నేడు నిరంతర లీకేజీలు నెలకొంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. జగనన్న కాలనీలలో కూడా నీటి వసతి సరిగా లేదని ఆయా గ్రామాల లబ్ధిదారులు వాపోతున్నారు.

కనిపించని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

నిరంతరం మండలంలో అందుబాటులో ఉండి ఏ గ్రామంలో నీటి సమస్య ఉంది అనేది తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణ వారాల తరబడి మండలానికి రాకపోవటంతో ఎక్కడి సమస్య అక్కడ ఉండిపోతోందనే వాదన బలంగా వినిపిస్తోంది. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ మాత్రం వారానికొకసారి కూడా ఆఫీసుకు రావటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎంపిడిఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉంటే సంబంధిత ఏఇ స్పందించాల్సి ఉంటుందని, అతని పని తీరును విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్‌బి, హార్టికల్చర్, ఆర్టీసీ, వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం, మరి కొంతమంది పలు శాఖల అధికారులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభించాల్సి ఉండగా కొన్ని శాఖల అధికారులు రాకపోయినా వచ్చిన కొద్దిమందితోనే 12.45 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సిహెచ్ కృష్ణ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణం లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గృహాలు పూర్తి స్థాయిలో పూర్తయ్యాయని, మరికొన్ని గృహాలు పూర్తి కావాల్సిఉందని, తక్షణమే అధికారులు, సర్పంచులు చొరవ చూపి పూర్తి చేయించాలన్నారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అంబడిపూడి గ్రామ సర్పంచ్ కుసుమకుమారి మాట్లాడుతూ మాపై రాజకీయ కక్షతో గత మూడు సంవత్సరాల నుంచి పంచాయతీకి నిధులు మంజూరు కాకుండా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయకపోతే గ్రామాలలో అభివృద్ధి పనులు ఎలా చేయించాలని ప్రశ్నించారు. ఇప్పటికే పారిశుధ్య పనులకు, సచివాలయం కరెంట్ బిల్లు సైతం తన సొంత నిధులు చెల్లిస్తున్నానన్నారు. నమ్మి సర్పంచిగా గెలిపించిన ప్రజలకు మేలు చేయాలంటే తక్షణమే అంబడిపూడి పంచాయతీకి నిధులు మంజూరు చేయించాలని ఆమె కోరారు. ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు రాకపోగా సమావేశానికి వచ్చిన అధికారులు వారు తెచ్చుకున్న స్క్రిప్ట్ చదివి వినిపించి వెళ్లిపోయారు. ఈ సమావేశానికి బాపట్ల జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య, ఈవోఆర్డి సీతామహాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు.



ప్రమాదంలో మృతి చెందిన బ్రహ్మయ్య

బైకును ఢీకొన్న ఆటో

ఒకరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

గుర్తుతెలియని నాలుగు చక్రాల ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మహిళతో పాటు యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం- శంకరాపురం రోడ్డులోని మాగాణి వద్ద ప్రమాద ఘటన జరిగింది. అందిన వివరాల ప్రకారం.. ముండ్లమూరు గ్రామానికి చెందిన మతుడు తన్నేపల్లి బ్రహ్మయ్య(47) తన కుమారుడిని తీసుకొని లక్కవరం గ్రామానికి చెందిన నాగసుబ్బావతిని తీసుకొని అద్దంకి పట్టణంలో బేల్దారు పనులు చేస్తూ ఉంటారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని నాలుగు చక్రాల ఆటో ఢీకొట్టడంతో బ్రహ్మయ్య అక్కడకక్కడే మృతిచెందగా మతుడు కుమారుడు యాసోల, నాగసుబ్బావతిలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించడంతో క్షతగాత్రుల్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతుని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గంజాయి ప్రమాదకరం: సీఐ

ప్రజాశక్తి-చిన్నగంజాం

గంజాయి, డ్రగ్స్ వినియోగం వలన ఆరోగ్యం, కుటుంబాలు దెబ్బతింటాయని వాటికి దూరంగా ఉండాలని సీఐ సూర్యనారాయణ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని సోపిరాల గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. పెరుగుతున్న సాంకేతిక వ్యవస్థ మూలంగా సైబర్ నేరాలు పెరుగు తున్నాయని వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అమితవేగం ప్రమాదాలకు మూలమని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుక వచ్చి శాంతి భద్రత లను కాపాడటంలో అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళపై కక్షతో కొడవలితో దాడి

ప్రజాశక్తి-వెలిగండ్ల: మహిళపై ఓ వ్యక్తి కొడవలితో దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వెలిగండ్ల ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వెలిగండ్ల మండలం జంగం నర్సాయపల్లి గ్రామానికి చెందిన దోగిపర్తి కాసింబి అనే మహిళ సాయంత్రం నాలుగు గంటల సమయంలో పొలంలోకి గడ్డి కోయటానికి వెళ్లగా అది గమనించిన అదే గ్రామానికి చెందిన కటుకూరి చిన్నకాసిం ఆమె దగ్గరకు వెళ్లి కుటుంబ కక్షల నేపథ్యంలో ఆమెతో దుర్భాషలాడుతూ ఆమె గడ్డి కోస్తున్న కొడవల్ని తీసుకొని ఆమెపై దాడి చేశాడు. గాయపడిన ఆమె వెంటనే తన కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని తెలపడంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రురాలిని 108 వాహనంలో కనిగిరి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో జూదరులు

ప్రజాశక్తి-పొన్నలూరు: మండలంలోని బోగనంపాడు గ్రామ శివారులో కోడిపందాలపై ఎస్ఐ దాసరి రాజారావు మరియు సిబ్బంది దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ రాజారావు శుక్రవారం తెలిపారు. కోడిపందాలు ఆడుతున్న వారి నుంచి పందెపుకోడిని, రూ.3,610 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

నిరంతర వర్షాలు.. పొలాల్లోనే పంటలు

ప్రకృతి ప్రకోపానికి అన్నదాత కుదేలు ● ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రబీలో పండించిన జొన్న, మొక్కజొన్న పంటతో పాటు ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట కుప్పలు కూడా నేటికి పొలాల్లోనే ఉండిపోయాయి. శుక్రవారం కురిసిన వర్షానికి తడిసి ముద్దయ్యాయి. సాధారణంగా వేసవిలో జొన్న, మొక్కజొన్న పంటను పూర్తిగా ఎండబెట్టి ఇళ్లకు తరలించి వరి కుప్పల నూర్పిడికి సిద్ధపడుతుంటారు. ఇప్పటి వరకు వర్షాలు లేకపోతే దాదాపు గా రబీ పంట ఇళ్లకు చేర్చుకొని మే నెలాఖరు నాటికి వరి కుప్పలు నూర్పిడి చేసే వారమని నిరంతర వర్షాల కారణంగా పొలంలో ఉన్న పంటలు ఇంటికి చేరుతాయో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూన్ నెల నుంచి ఇప్పటి వరకు పంటలకు అప్పులు చేసిమరి పెట్టుబడులు పెడుతున్నామని వర్షాల కారణంగా రెండు పంటలు పొలాల్లోనే తడిచి పోతుండటంతో ఏమి చెయ్యాలో, అప్పులు ఎలా తిరతాయో అర్థంకాక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. పంటలు రైతు చేతికి రాకముందు ధాన్యం బస్తా రూ.1800 వందలు, మొక్కజొన్న రూ.2,200 వరకు ఉన్న ధర నేడు ధాన్యం 1,600లకు, మొక్కజొన్న క్వింటా రూ.1,600కు మాత్రమే కొనుగోలు చేస్తూ వ్యాపారస్తులు రైతులను నిలువునా దగా చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తూ రైతుల పట్ల కపట ప్రేమ వలకపోస్తూ మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ధరల స్థిరీకరణ ఎక్కడ కనిపించటం లేదని, రైతు భరోసా కేంద్రాలలోనే పంటల విక్రయాలు జరుపుకోవాలన్న విధానం కాగితాలకే పరిమితం అయ్యిందని, కనీసం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు ఏర్పాటు చేయకపోవటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



నేటికీ పొలాల్లోనే వరి కుప్పలు, జొన్న గుట్టలు



పొలాల్లోనే మగ్గుతున్న మొక్కజొన్న

అకాల వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న

ప్రజాశక్తి-పంగులూరు: అకాల వర్షం మరోసారి కొండమంజులూరు గ్రామంలోని మొక్కజొన్నను ముంచివేసిం ది. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలో కురిసిన కుండపోత వర్షానికి మొక్కజొన్న కండెలు నీట మునిగాయి. గత వారం రోజులు క్రితం కురిసిన అకాల వర్షం, గాలికి ఈ గ్రామంలో సుమారు 100 ఎకరాలకు పైగా మొక్కజొన్న మొత్తం నేల వాలింది. ఈరోజు కురిసిన వర్షానికి నేల వాలిన మొక్కజొన్న కండేలు నీటిలో మునిగాయి. ఆరుబయట ఎండ పెట్టుకునేందుకు, పరదాలు కప్పిన మొక్కజొన్నలు కూడా తడిశాయని కొంతమంది రైతులు చెప్పారు. మొక్కజొన్న ధర ఈ 20 రోజుల కాలంలో రూ.2,200 నుంచి రూ.1,700కు తగ్గిపోయింది. వ్యాపారులంతా సిండికేట్ అయ్యి, ధరను తగ్గించుకుంటూ వచ్చారు. ఈ వారం రోజులు కాలంలో, అకాల వర్షాలకు మొక్కజొన్న తడిసిందనే నెపంతో వ్యాపారులు రైతులు ఎవరిని మొక్కజొన్నల గురించి అడగటం లేదు. దీంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు కురిసిన రెండోసారి అకాల వర్షానికి, నేలవాలిన మొక్కజొన్న కండెలు వర్షపు నీటిలో మునిగిపోవడంతో మొక్కజొన్నను వ్యాపారులు కొంటారా? కొనరా? కొంటే ఎంత ధరకు కొంటారో అంటూ రైతులు మదనపడు తున్నారు. సుమారు గంటన్నర పాటు కుండపోతగా వర్షం కురవడంతో, రైతులు పొలాల వైపు పరుగులు తీశారు. కండెల్లోకి నీరు పోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేయకపోతే ఈ సంవత్సరం మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, తడిసిన మొక్కజొన్నలు కూడా కొనాలని, పలువురు రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.



కొండమంజులూరులో వర్షపునీట మునిగిన మొక్కజొన్న

ఎస్‌ఎఫ్‌ఐ నమూనా పాలిసెట్ విజయవంతం

ప్రజాశక్తి-కొల్లూరు

పాలిటెక్నిక్ చదివేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 2023 పాలిసెట్ మోడల్ పరీక్షను స్థానిక వాసవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనుభవ జ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రశ్నాపత్రం తయారుచేసి పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ మే 10వ తేదీన జరగనున్న పాలిసెట్ పరీక్షకు ముందుగా మోడల్ పరీక్షను రాయడం వలన విద్యార్థుల్లో భయంపోయి ప్రభుత్వం నిర్వహించే పరీక్షను అర్థం చేసుకుని రాయడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే పాలిటెక్నిక్ పరీక్షల్లో అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

భట్టిప్రోలు: భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాయత్రి అకాడమీలో ఇంజనీరింగ్, ఫార్మశి, అగ్రి, పాలిటెక్నిక్ మోడల్ టెస్ట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి మనోజ్ మాట్లాడుతూ మే నెల 10వ తేదీన పాలిసెట్, 15వ తేదీన ఇఏపి సెట్ జరుగనున్నందున విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ టెస్ట్ ఉపయోగ పడుతుందని అన్నారు. నూతనంగా పోటీ పరీక్షలలో పాల్గొంటున్న దృష్ట్యా వారిలో భయం తొలగుతుందని, పరీక్ష రాసే విధానం అర్థమవుతుందని అన్నారు. మోడల్ టెస్ట్ పూర్తి కాగానే ఫలితాలు తెలియజేయటమే కాక అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి అకాడమీ ప్రిన్సిపాల్ షణ్ముఖ ఉన్నారు.





కొల్లూరు, భట్టిప్రోలుల్లో నమూనా పాలిసెట్ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జగనన్న కిట్ అందేలా ప్రణాళికలు: డిఇఓ

ప్రజాశక్తి-బాపట్ల: ఈ యేడాది జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి ప్రతి విద్యార్థికి జగనన్న కిట్ అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని బాపట్ల జిల్లా విద్యా శాఖాధికారి పివిజె రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం సమగ్ర శిక్ష బాపట్ల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా, మండల స్థాయి మానిటరింగ్ టీం విధులు, బాధ్యతలపై జిల్లా స్థాయి సమావేశం బాపట్ల ఏబిఎం హైస్కూల్లో నిర్వహించారు. డిఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి జరగాలన్నారు. పాఠశాలలకు చేరిన కిట్లు చెదలు పట్టకుండా భద్రపరిచేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పలు విద్యాంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల, సమగ్ర శిక్ష సిఎంఓ రజిని, ఈఈ కెవి నాగజ్యోతి, డిఆర్‌డిఏ సమన్వయం అధికారి ఆర్ఎల్ అంబేడ్కర్, ఎంఈఓలు, మండల కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఓ పివిజె రామారావు



సమ్మర్ కిడ్స్ క్యాంపు ప్రారంభ సమయంలో..

జెవివి కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి-అద్దంకి

విద్యార్థుల మనో వికాసానికి, సృజనాత్మకతకు దోహద పడేలా ఇలాంటి విజ్ఞాన, వినోద కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని అద్దంకి సబ్ పోస్ట్‌మాస్టర్ ఆర్‌వి రాఘవరావు అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థుల సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. జెవివి అద్దంకి డివిజన్ కార్యదర్శి తంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్కులు, ర్యాంక్ ల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. నేడున్న ఆధునిక వ్యవస్థలో నాయకత్వం లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ అతి ముఖ్యమన్నారు. వీటిని అభివృద్ధి చేసేందుకు, కిడ్స్ సమ్మర్ క్యాంపు పేరుతో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతాయని, విద్యార్థులు ఈ క్యాంపును వినియోగించుకోవాలని కోరారు. మొదటిరోజు సన్నివేశం ఆధారంగా విద్యార్థులు కథ చెప్పడం, పాటలు నేర్చుకోవడం తదితర అంశాలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, కెకె కుమార్ పూర్ణ, బీవీ రత్నం, దామా రామాంజనేయులు, జెవివి నాయకులు కే రఘు చందు, లెవి ప్రసాద్, రామారావు, సుబ్బారావు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీవివి నాయకులు

డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం సరికాదు

ప్రజాశక్తి-చీరాల

నూతన విద్య విధానం అంటూ విద్యావ్యవస్థలో అనేక మార్పులను తీసుకువచ్చి డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని చరిత్ర పాఠాలు విద్యార్థులకు తెలియకుండా వాటిని తొలగించటాన్ని ఖండిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి రాజశేఖర్ రాహుల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో హెూంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షులు వై భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానంలో అనేక మార్కులు తీసుకువచ్చి చరిత్రలు విద్యార్థులకు తెలియనీయకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని అన్నారు. తద్వారా శాస్త్రీయ ఆలోచన విధానం సామాన్య ప్రజలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. మూఢనమ్మకాల వ్యతిరేక చట్టాన్ని ప్రభుత్వం తీసుకు రావాలని అన్నారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్ర రామారావు మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 17 వరకు వేసవి వినోద కార్యక్రమాలు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాలపర్తి శ్రీను కుమార్తె వివాహ మహెూత్సవంలో పాల్గొని దంపతులను ఆశీర్వదించారు. జెవివి ప్రధాన కార్యదర్శి సుభాని, కళాధర్, యుటిఎఫ్ నాయకులు కే శ్రీను, జి సూరి బాబు, ఎన్ కోటేశ్వరరావు, హేమంత్, దక్షిణామూర్తి, శివ న్నారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంఘం సభ్యులుగా డాక్టర్ విజయమ్మ

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల అసోసియేషన్ బాపట్ల జిల్లా శాఖ సభ్యులుగా బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ ఎంపికైనట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఒక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ సభ్యులు విజయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పీహెచ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమెను దశ్శా లవతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు కిరణ్ కుమార్, కార్యదర్శి, అఖిలేష్, కోశాధికారి, సభ్యులు సురేష్ కుమార్, పలువురు వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజాశక్తి
5
శనివారం 6 మే 2023

పేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- కలెక్టర్ దినేష్ కుమార్
- కళ్యాణమస్తు, షాదీ తోఫా చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకాలలో భాగంగా రెండో జాబితాకు సంబంధించిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో నేరుగా నిధులు జమ చేస్తున్న సందర్భంగా శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం జిల్లా నుంచి కలెక్టర్ దినేష్ కుమార్, జడ్పి చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. హాజరయ్యారు. అనంతరం లబ్ధిదారులకు రూ.2,16,80,000 విలువైన చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలు, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని ఆడపిల్లలకు వైఎస్ఆర్ కళ్యాణమస్తు ద్వారా, ముస్లిం మైనారిటీ వర్గాల ఆడ పిల్లలకు వైఎస్ఆర్ షాదీతోఫా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. బాల్య వివాహాలను నివారించడంతోపాటు ప్రతి బిడ్డ కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించడాన్ని ప్రామాణికంగా తీసుకొని ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి బ్యాంకు ఖాతాలో, అదే కులంలో వివాహం చేసుకున్న వధువులకు వారి తల్లుల బ్యాంకు ఖాతాలలో ఈ ఆర్థిక సహాయం జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో వివాహం చేసుకున్న జిల్లాలోని 276 మంది అర్హులను గుర్తించామన్నారు. వారికి రూ.2,16,80,000 ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. జడ్పి చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కేవలం బిడ్డల వివాహం విషయంలోనే కాకుండా వారి చదువులలోనూ ఆర్థిక సహాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ బి.బాబూరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ దినేష్కుమార్ జడ్పి చైర్పర్సన్ వెంకాయమ్మ

దాచూరి రామిరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఒవి. వీరారెడ్డి డిమాండ్ చేశాడు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బారెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన మాజీ ఎమ్మెల్సీ, యుటిఎఫ్ వ్యవస్థాపకులు దివంగత దాచూరి రామిరెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ప్రాథమిక విద్యా విధానం నిర్వీర్యం అయ్యే దశకు చేరుకుందన్నారు. 2022లో ప్రభుత్వం ఇచ్చిన ప్రమోషన్లు, బదిలీలు, సర్దుబాటు ఉత్తర్వులు రద్దు చేయడం విద్యాశాఖ వ్యవస్థకే విరుద్ధమన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకుడు మీగడ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల విద్యార్థులు ఆలోచన శక్తిని కోల్పోయి మతబీజాలు నాటే విధంగా ఉన్నా యన్నారు. డార్విన్ సిద్ధాంతం, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, మొగలుల చరిత్ర వంటి ముఖ్య అంశాలు లేకుండా రూపొందించి పుస్తకాలు బోధించే దుస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి. రమణారెడ్డి, గిద్దలూరు రాచర్ల కొమరోలు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. సాయన్న, ఎస్. జయ చంద్రారెడ్డి , ఆవులరాజు , కష్టారెడ్డి, హకీమ్, కాశిం, శ్రీనివాసరెడ్డి, ఖాదర్, శ్రీనివాసులు


నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధి కూలీలకు అండగా ఉంటాం

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

ఉపాధి కూలీలకు అండగా ఉంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. పామూరు పాత చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హనీఫ్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. గతేడాది చేసిన పనులకు రెండు, మూడు వారాల బిల్లు రాలేదని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, మంచినీరు, కనీస సౌకర్యాలు కల్పించ లేదని, గడ్డపారలకు అందజేయాలని ఉపాధి కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ ప్రమాదంలో చనిపోయిన ఉపాధి మేట్లకు రూ. ఐదు లక్షల ఎక్స్ గ్రేసియా చెల్లించాలన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.300 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వీరనారాయణ, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

రామన్నచెరువుకు పూర్వ వైభవం వచ్చేనా..?

- దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు
- చెరువులో వ్యర్థాల డంప్

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

సుమారు మూడు శతాబ్దాల చరిత్ర కలిగిన చదలవాడ రామన్నచెరువు ప్రాశస్త్యం కోల్పోయింది. తాగునీటి అవసరాలకు నిర్దేశించిన మంచినీటి చెరువు కొందరు వ్యక్తుల స్వార్థపూరిత చర్యలతో కలుషితం అవుతుంది. చెరువులో చికెన్ స్టాల్స్ లోని వ్యర్థాలతో పాటు, చెత్తా చెదారాన్ని డంప్ చేస్తున్నారు.

నాగులుప్పలపాడు మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చదలవాడ గ్రామంలో 275 ఏళ్ళ క్రితం 25.10 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువును తవ్వించినట్లు స్థానికుల కథనం... ఏటా దాసరపల్లి డొంక వాగు నుంచి వర్షపునీటితో ఈ చెరువు నిండుతుంది. చదలవాడ, కేసినేనివారిపాలెం గ్రామాల ప్రజలకు దాహార్తి తీర్చేందుకు రఘునాయకస్వామి ఆలయానికి అనుబంధంగా అగస్త్య మహర్షి ఈ చెరువును తవ్వించారని ఓ కథనం ఉంది. కొంఖలయ్యవారు ఈ చెరువు దిబ్బపై జపం చేసినందున కొంగలదిబ్బ అని పేరు వచ్చినట్లు గ్రామస్తుల కథనం. ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండే చెరువు నిన్న మొన్నటి వరకు వినియోగంలో ఉంది.

పొంచివున్న ప్రమాదం..

216 జాతీయ రహదారి అవసరాలకు చెరువులోని (చెరువుకట్టతో) రెండెకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దాని స్థానంలో తాత్కాలికంగా మట్టితో మరో కట్టను ప్రభుత్వం నిర్మించింది. కట్ట బలహీనంగా ఉండటంతో గత రెండేళ్లలో రెండు సార్లు గండిపడింది. చెరువు నీరు వృథా కావడంతో పాటు పల్లపు ప్రాంతాల నివాసాలు మునకకు గురయ్యాయి. అధికారులు తాత్కాలికంగా గండిపూడ్చి చేతులు దులుపుకున్నారు తప్ప. శాశ్వత ప్రాతిపదికన కట్టను పటిష్ఠపరిచిన దాఖలాలు లేవు.

నేషనల్ హైవే అధికారుల ఉదాసీనత

జాతీయ రహదారి విస్తరణలో చెరువుకు సంబంధించిన స్థలం రెండెకరాలు స్వాధీనం చేసుకునే సందర్భంలో చెరువుకట్టకు రివిట్ మెంట్ తో పటిష్ఠపరచి విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని ఒప్పందం కుదిరింది. రహదారి నిర్మాణం పూర్తయి రెండేళ్లు దాటినా చెరువు విషయం గురించి అధికారులు పట్టించుకోలేదు.

కొరవడిన అధికారుల చొరవ...

ఐటిసి సంస్థ చెరువును అభివృద్ధి పరుస్తామని రెండు సార్లు పాలకవర్గాన్ని కోరింది. అందులు సంబంధించిన నివేదికలు ఇవ్వమని ఐటిసి కోరింది. ఈ అంశం తన పరిధిలో లేదని గ్రామీణ నీటీ సరఫరా విభాగపు అధికారి చెప్పి తప్పుకున్నారు.

చెరువును అభివృద్ధి పరచడమే ఆశయం...

తాను పదవిలో ఉన్నపుడే రామన్నచెరువును అభివద్ధి పరుస్తానని సర్పంచి దాసరి వరప్రసాదరావు తెలిపారు. అధికారుల సూచనమేరకు ఎమ్మెల్యే సహకారంతో చెరువును పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు..

ఇంజినీరింగ్ అధికారులు చొరవచూపాలి : డిపిఒ

తాగునీటి చెరువు అభివద్ధికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చొరవచూపాలని జిల్లా పంచాయతీ అధికారి జి.నారాయణ రెడ్డి తెలిపారు. ఎస్టిమేట్లు తయారు చేసి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపితే నిధులు మంజూరు అవుతాయని ఆయన తెలిపారు.


చెరువులో దర్శనమిస్తున్న పిచ్చి మొక్కలు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మారంవెంకారెడ్డి

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్, వైసిపి జిల్లా నాయకుడు మారం వెంకారెడ్డి సేవలు అభినందనీయమని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ జవహర్ తెలిపారు. మారం వెంకారెడ్డి తల్లి మారం చిన్నమ్మ వర్ధంతి సందర్భంగా మారం పేరిరెడ్డిచిన్నమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జవహర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మారం వెంకారెడ్డి అభినందనీయులన్నారు. మారం వెంకారెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు అనవాయితీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మారం వెంకారెడ్డి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని డాక్టర్ జవహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువనాయకుడు మలినేని వెంకటేశ్వర్లు మారం సింగారెడ్డి, అశోక్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు గంగిరెడ్డి బులరెడ్డి,పేరం శ్రీను, కౌన్సిలర్ గంగయ్య, పోకూరి రామ కృష్టారెడ్డి, కోటా రాములు, నాగరాజు, దోమల పుల్లయ్య, అయ్యపురెడ్డి, శంకర్, ఆలపాటి నరసింహారావు, మేళం వెంగన్న,సర్పంచి సింగారెడ్డి, దశరామిరెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పిగా వీరరాఘవరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డిఎస్‌పిగా జి.వీరరాఘవరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డిఎస్‌పిగా పనిచేసిన డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్ బదిలీపై అమలాపురం వెళ్లారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వీరరాఘవరెడ్డిని మార్కాపురం సిఐ ఎం.భీమానాయక్, పట్టణ ఎస్ఐలు శశికుమార్, సువర్ణ, మార్కాపురం రూరల్ ఎస్ఐ సుమన్, సబ్ డివిజన్‌లోని సిఐలు, పలువురు ఎస్ఐలు కలిసి అభినందనలు తెలిపారు.




నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టిడిపి నాయకుడు 'రావిపాటి' మృతి

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని చోడవరం గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి, మాజీ ఎంపిపి రావిపాటి మధుసూదన్‌రావు (60) గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కుమారులు అమెరికాలో ఉన్నారు. మధుసూదనరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి , టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డపాటి యలమంద నాయుడు, టిడిపి నాయకులు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మధుసూదనరావుకు శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-ముండ్లమూరు

జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపిడిఒ కుసుమకుమారి తెలిపారు. మండల పరిధిలోని పసుపుగల్లు,రెడ్డినగర్,కొక్కెరకొండాయపాలెం నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధన ప్రకారం పనులు చేస్తే రోజు వారీ కూలీ రూ.273 గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కొండయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చింతల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

65 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని అనకర్లపూడి గ్రామంలో వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు పెట్లూరు పిహెచ్‌సి సిహెచ్ఒ ఎస్.కృష్ణంరాజు తెలియచేశారు.మొత్తం 65 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వేముల ధనలక్ష్మి, వైద్యసిబ్బంది బి.మురళికృష్ణరెడ్డి, నరసింహం, తిరుమల, రజని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

50శాతం రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అంద జేయనున్నట్లు ఎఒ విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ముండ్లపాడు రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జనుము, పిల్లి పెసర, జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు రవిచంద్రుడు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- మర్రిపూడి

మర్రిపూడిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్ఫూర్తి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురిజాల యేబు తెలిపారు. వైద్యశిబిరంలో జరనల్ సర్జన్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

యర్రగొండపాలెం ఎపిఒగా శైలజ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జాతీయ ఉపాధి హామీ చట్టం యర్రగొండపాలెం మండల ఎపిఒగా ఎం. శైలజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పుల్లలచెరువు మండల ఎపిఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. యర్రగొండపాలెంలో పని చేస్తున్న నాగేశ్వరరావు చెంచు గిరిజన శాఖ ఉపాధి హామీ చట్టం ఎపిఒగా బదిలీపై వెళ్లారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి- కొండపి

కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలోని టిడిపి నాయకుడు కల్లూరి రమణయ్య, వాణి దంపతుల కుమారుడు వెంకటేష్, శ్రీవాణిల వివాహ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బొద్దులూరి మోహన్‌రావు, కోటపాటి చంద్రమోహన్, ఆరికట్ల వెంకటరావు పాల్గొన్నారు.

11న ఇంటర్వ్యూలు

మద్దిపాడు : అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 11న ఒంగోలు రాంనగర్‌లోని బాలికల శిశుసంక్షేమ శాఖ కార్యాలయలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మద్దిపాడు సిడిపిఒ ఇవాంజలియన్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండల పురిధిలోని పి. నాయుడుపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.1.26 కోట్లతో నిర్మిస్తున్న పి.నాయుడుపాలెం-శివరామపురం బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, ఎంపిపి



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లివెంకాయమ్మ

యద్దనపూడి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి కూడల అంజలి మాలకొండయ్య, సర్పంచి కరుణప్రియ నాని, నాయకులు రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. **పిసిపల్లి :** సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని మారేళ్ళ, మురుగుమ్మి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు పరిమి వెంకటరావు, ఎంపిటిసి చెరుకూరి సతీష్, గృహసారథుల మండల కన్వీనర్ శీలం సుందర్శనం, సింగిల్‌విండో అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, మేకల మాల్యాద్రి, మురుగుమ్మి సర్పంచి నలగంగుల సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మార్షల్ ఆర్ట్స్ అధినేత తన్నీరు సాయి వేణు ఆధ్వర్యంలో నిర్వహిసున్న వేసవి శిక్షణ శిబిరాన్నిబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్క మంతల వినయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినయ్‌కమార్ మాట్లాడుతూ ఆత్మరక్షణలో కుంగ్‌ఫూ కి ప్రత్యేక స్థానం ఉందన్నారు. వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు, ప్రసాద్, శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్లు పిల్లి హజరత్తయ్య, నామా చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నరేంద్ర కుమార్, సుధాకర్, ప్రభాకర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

బాల సంస్కార కేంద్రాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-కొత్తపట్నం

శ్రీరామ్ బాలసంస్కార కేంద్రాల 2022-23 విద్యా సంవత్సర వార్షికోత్సవ వేడుకలు కొత్తపట్నం పల్లెపాలెం శుక్రవారం నిర్వహించారు. కొత్తపట్నంలోని శ్రీవాణి విద్యా నికేతన్, ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా కేంద్రాల వార్షికోత్సవ వేడుకల్లో విద్యానికేతన్ కరెస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, హాస్పిటల్ వైద్యులు చాపల శాంత కుమారి, చాపల వంశీకష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుండే భవిష్యత్ లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని ఎలా సాధించాలో మార్గనిర్దేశం చేశారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన నాలుగో తరగతి విద్యార్థి సైకం వరుణ్ శంకర్‌కు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల సూపర్ వైజర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు సంధ్యశ్రీ, శిరీష పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న వైద్యులు


కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ మగ్బూల్ హుస్సేన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో బిఎ హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బిఎస్‌సి బాటని, హార్టికల్చర్, కెమిస్ట్రీ, బికాం కంప్యూటర్స్ అప్లికేషన్స్, బిఎస్‌సి మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రతి కోర్సులో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రోహిణి, ఏనుగుల రవికుమార్, డి.షేక్షావలి, బొటుకు యల్లారావు, బండారు నరసింహారాజు, చిట్యాల రమణారెడ్డి, వి హార్లీ జయరాజ్, సిహెచ్ కష్ణారెడ్డి, పెరుమాళ్ళ రాజేష్, కైత రాజేశ్వరి, నారు వెంకట నాగలక్ష్మి, అడిపి లక్ష్మీ ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరణలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు



వైవి.సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న మంత్రి సురేష్ దంపతులు

టిటిడి చైర్మన్‌ను కలిసిన మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డిని విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో రాజకీయాలు వేడెక్కిన నేపథ్యంలో మంత్రి సురేష్ వైవి. సుబ్బారెడ్డిని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా వారు జిల్లా రాజకీయాలపై చర్చించుకున్నారు. మంత్రి వెంట ఆయన భార్య ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ విజయలక్ష్మి ఉన్నారు.

గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-దర్శి

తాళ్ళూరు మండలం మాధవారం గ్రామంలో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు శుక్రవారం నూతన గృహప్రవేశ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ , మద్దిశెట్టి రవీంద్ర పాల్గొని ఎంపిపి శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు ఎంపిపి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ ఇడమకంటి వేణు గోపాల్, వైస్ ఎంపిపిలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, ప్రియాంక నాగార్జునరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **దొనకొండ :** మండల పరిధిలోని గంగదేవిపల్లి గ్రామంలో వైసిపి నాయకుడు, మాజీ సర్పంచి కర్నాటి సునీతా రాంజనేయరెడ్డి నూతన గృహ ప్రవేశ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొని కర్నాటి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తొలుతకర్నాటి ఆధ్వర్యంలో మహిళలు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, ఐలూరి శ్రీనివాసరెడ్డి,వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముడ్లమూరు మండలం నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని తమ్మలూరు గ్రామంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు తహశీల్దారు నయూమ్ అహ్మద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తుందన్నారు. ఇనుము,సిమెంట్ ప్రభుత్వమే సరఫరా చేస్తుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహాలు నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటీ రవికాంత్, హౌసింగ్ ఎఇ హనుమంతరావు, వైస్ ఎంపిపి బంకా రమణమ్మనాగిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ నేరాలు జరగకుండా

'బీట్'ను పటిష్టం చేయండి: ఎస్‌పి

ప్రజాశక్తి-చినగంజాం

గంజాయి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా ఎస్పీ చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చిన్నగంజాం పోలీస్ స్టేషన్ తనిఖీ నిర్వహించారు. ముందుగా సిబ్బంది వద్ద నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ గారు పోలీస్ స్టేషన్ పరిసరాలను వివిధ కేసులలో సీజ్ చేయబడిన కేసు ప్రాపర్టీని, వాహనాలను పరిశీలించారు. చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ సచివాలయ మహిళ పోలీసులు, పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై వారు చేస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ సచివాలయ మహిళా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు 'మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్' వెబ్ సైట్‌లో వారు చేసిన విధులను, వారి పరిధిలో జరిగిన కుటుంబ తగాదాలు, భూ వివాదాలు మరియు ఇతర నేరాల గురించిన సమాచారం పొందుపరచాలన్నారు. రౌడీలు, సస్పెక్ట్‌లు, పాతనేరస్తుల కదలికలకు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని, గ్రామ పరిధిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఎప్పటికప్పుడు అందజేయాలని, పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న వారి




చిన్నగంజాం పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

సచివాలయ పరిధిలోని కేసుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆ కేసు యొక్క స్థితిగతులను ఫిర్యాది, సాక్షులు, ముద్దాయిల వివరాలు తెలుసుకోవాలని, మహిళలపై, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒంటరి మహిళలను గుర్తించి తరచూ వారి ఇంటిని సందర్శిస్తూ ఉండాలని, సైబర్ నేరాల గురించి, లోన్ యాప్ ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామ సచివాలయ మహిళ పోలీసులు సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తే నేరాలు సులువుగా నియంత్రించవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలోనే పోలీస్ సిబ్బంది వారి దత్తత గ్రామాన్ని వారానికి ఒకసారి కచ్చితంగా సందర్శించాలన్నారు. గ్రామంలోని ప్రజలతో మమేకమై గ్రామాలలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా, వస్తే వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. గంజాయి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి సంబంధిత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారిపై నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. గ్రామాలలో ఉన్న పాత నేరస్తులపై పటిష్ట నిఘా ఉన్నప్పుడే గంజాయిని కట్టడి చేయగలమని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ప్రదేశాల గురించి, ఆ ప్రదేశాలలో తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి సమీక్షించినట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ వార్షిక తనిఖీలో చీరాల డిఎస్‌పి ఎస్ ప్రసాద్‌రావు, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి సూర్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, సిసి హరి కృష్ణ, చిన్నగంజాం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్, మాజీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె అనుక్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు గ్రామ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-రేపల్లె

ప్రకతి వ్యసాయం వలన కలిగే ప్రయోజనాలను గురించి రైతులు అవగాహన పెంచుకోవాలని ఫ్రీ మాన్ డ్రై షోయింగ్ సంస్థ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ శివ నాగేశ్వరమ్మ కోరారు. మండలంలోని ఉప్పుడి గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అధిక పెట్టుబడులు పెట్టకుండా ఆరోగ్య కరమైన పంటలను సాగు చేసేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు రైతులకు నవధాన్యాలను పంపిణీ చేశారు. నవధాన్యాల సాగు చేయటం వలన భూసారం పెరుగుతోందని వివరించారు. నవధాన్యాల సాగుతో పంటల నాణ్యత పెరుగుతోందని చెప్పారు చిరు ధాన్యాలతో పండిన పంటలు తినటం వలన ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు.



రథోత్సవంలో పాల్గొన్న నరేంద్రవర్మ

రథోత్సవంలో నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

శతాబ్దాల చరిత్ర గల బాపట్ల భావనారాయణ స్వామి రథోత్సవంలో బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన వైభవంగా జరిగిన రథోత్సవంలో నరేంద్రవర్మ రథాన్ని లాగారు. ఉత్సవంలో ఆయనతోపాటు పలుగురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సింగరకొండలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఈరోజు పూర్ణిమ సందర్భంగా లక్ష తమలపాకుల పూజ అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయ దాతలుగా ఒంగోలు, గోపాల్ నగరం వాస్తవ్యులు సిహెచ్ శ్రీనివాసరావు దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పూజ అనంతరం దేవస్థానం వేదపండితుల అర్చకులు ఉభయదాతలకు, భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

మొక్కజొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడిఏ సయ్యద్ అత్తర్ హుస్సేన్ కోరారు. బేతపూడి గ్రామంలో అకాల వర్షాల కారణంగా నీట మునిగిన మొక్కజొన్న పొలాలను ఆయన పరిశీలించారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో టార్పాలిన్ పట్టాలతో రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. కోత కోసి కల్లాలలో ఉన్న మొక్కజొన్నను గుట్టగా ఒకచోట చేర్చుకుని పట్టాలతో కప్పి వేసుకోవాలన్నారు. పొలాలలో వర్షపు నీరు నిల్వ లేకుండా బయటకు పంపే మార్గాలు చూడాలన్నారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు సబ్ డివిజన్ పరిధిలో 7,600 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న తడిచినట్లు పేర్కొన్నారు. ఎక్కువగా వర్షపు నీరు ఉండి పంట నష్టం జరిగి ఉంటే కలెక్టర్ ఆదేశాల



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మేరకు గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లో ఉండే అగ్రికల్చర్ అసిస్టెంట్లను కలిసి రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరిపంటకు సంబంధించి ధాన్యం రంగు మారినా, అదేవిధంగా మొక్కజొన్న పంటకు సంబంధించి ఉన్న మొక్కజొన్న కండెలు కుళ్లి, పాడైపోయిన రైతులు వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడిఏ తెలిపారు. పూర్తి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రేపల్లె

గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని వెజెండ్లవారి లంక గ్రామంలో శుక్రవారం ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ



ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు ఆశీస్సులతో మోర్లవారిపాలెం గ్రామ పంచాయతీ వేజళ్ళవారిలంకలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజల అవసరానికి అనుగుణంగా 40 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మండలి అంజయ్య విశ్వేశ్వరం గ్రామ సర్పంచ్ మల్లేశ్వరరావు, మోర్తోట సర్పంచ్ శ్రీనివాసరావు, పేటేరు వైసీపీ ఇన్‌ఛార్జి కనపర్తి రవికిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోపాలకృష్ణ పంచాయతీ సెక్రటరీ బొర్రా ప్రసాద్, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్: ఐసిడిఎస్ పర్చూరు ప్రాజెక్ట్ పరిధిలోని మార్టూరు మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పర్చూరు సిడిపిఓ జి సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండల పరిధిలోని నాగరాజుపల్లి మెయిన్ సెంటర్ (ఓసి), మార్టూరులోని క్వారీ గుంటలు-2 (ఓహెచ్) ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని సిడిపిఓ తెలిపారు. ఎంపికయిన అభ్యర్థులకు రూ.7 వేలు గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వివరాలకు పర్చూరు ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

స్వామి వారి కల్యాణంలో ఆమంచి

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని రామన్నపేటలో లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామివారి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బండ్ల బాబు తిరుమలా దేవి (జడ్పిటిసి) కమిటీ వారి ఆధ్వర్యంలో



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న 'ఆమంచి'

అత్యంత వేడుకగా జరిగింది. కళ్యాణ దంపతులు బులసల శ్రీనివాసులు ధర్మపత్ని ఆదిలక్ష్మి తొలుత గ్రామ ఊరేగింపు తోటి దేవస్థాన వద్దకు వచ్చింది. మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ జరిగింది. సుమారు 1500 మంది భక్తులు భోజనాలు చేశారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా చీరాల మాజీ శాసనసభ్యులు, వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వారి సోదరులు ఆమంచి సీతయ్య వారి ధర్మపత్ని అమ్మవారిని దర్శించుకున్నారు. పుట్టింటి వారి పసుపు కుంకుమలతో రామన్నపేట గ్రామంలో గ్రామ ఊరేగింపు సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. కటారిపాలెం వారిచే కోలాటం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఉమ్మడి భాస్కరరావు, పృథ్వీ వెంకట మోహన్ కుమారి, మాజీ ఎంపీటీసీలు పేరిసెట్ల పద్మజ, మల్లం అంజమ్మ సజ్జా రాజ్యలక్ష్మి శాంతినికేతన్ మహిళా మండల అధ్యక్షులు గుమ్మడి సుశీల, పుట్టింటి వారైన బులసల రామలింగం రామలక్ష్మి, బులసల ప్రసాదరావు సుజాత, బండ్ల సురేంద్రబాబు విజయ, ఉమ్మిటి జనార్ధన్ రావు ఉమ్మిటి వేణు, ఉమ్మిటి భాస్కరరావు, బండ్ల ఉమామహేశ్వరరావు, దేవన కిషోర్, బట్ట సురేంద్రబాబు, బాలసుబ్రమణ్యం, శ్రీకాంత్, శ్రీనివాసులు, సుబ్బయ్య, గుత్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ స్థలాలను పరిరక్షించాలి

ప్రజాశక్తి-బాపట్ల

మండలాల్లో జిల్లా పరిషత్ స్థలాలను పరిరక్షించాలని గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రో క్రిస్టినా అన్నారు. శుక్రవారం బాపట్ల మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మండల పరిధిలో జడ్పీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. తనిఖీల్లో చైర్ పర్సన్‌తో పాటు జడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేరురాణి,



బాపట్ల ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్పీ చైర్మన్ క్రిస్టినా

మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కుర్రా రమాదేవి రాంబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈఓఆర్డి శరత్ బాబు, ఏఇ మోహన్ రావు, ఎంఈఓ నిరంజన్, కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న ఆటో వర్కర్లు

సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం

ప్రజాశక్తి-బాపట్ల

ఆటో వర్కర్ల సమస్యలు పరిష్కారానికి ఆటో వర్కర్లు సంఘటితంగా పోరాడాలని బాపట్ల పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గొలపల పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం ఆటో వర్కర్ల సమస్యలపై నిరసన తెలుపుతూ బాపట్ల పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డీజిల్, పెట్రోల్ ధరలను పెంచేస్తూ ఆటో రంగంతో ఆడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకుంటామని కల్లబొల్లి మాటలు చెబుతూనే మరోపక్క ఆటో కార్మికులను పరోక్షంగా ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. ఆటో వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగదన్నారు. బాపట్ల పాత బస్టాండ్ ఆటో స్టాండ్ నుంచి ఆరంభమైన ర్యాలీ, ఆటో ర్యాలీ అంబేద్కర్ సర్కిల్ నుంచి తిరిగి కొత్త బస్టాండ్‌కు చేరింది. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రేపల్లెలో భారీ వర్షం

- నీటమునిగిన మొక్కజొన్న ఓదెలు
- పిడుగుపాటుకు 14 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లెలో శుక్రవారం భారీవర్షం కురిసింది. మూడు రోజుల నుంచి ఒక మోస్తరు వర్షం కురవగా శుక్రవారం భారీ వర్షం పడింది. మొక్కజొన్న ఓదెలు నీటమునిగాయి. రైతులు ఈ సారి మొక్కజొన్న పంటను అధికంగా వేశారు. పంట ఆశాజనకంగా ఉండటంతో తమ అప్పులు తీర్చుకోవచ్చని రైతులు ఆశపడ్డారు. అకాల వర్షాలు రైతులకు నిరాశే మిగిల్చాయి. వర్షంతో పాటు ఈదురు గాలులు కూడా వేయడంతో మొక్కజొన్న పంట నేలకొరిగి నీటిలో తేలియాడుతోంది. గత మూడు రోజుల నుండి వర్షపు నీటిలో పంట తేలియాడటంతో పంట దెబ్బ తినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులు పంట చేతికి వచ్చే సమయంలో నీట మునగడంతో కంటతడి పెడుతున్నారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

రేపల్లె మండలంలోని ఉప్పూడి గ్రామంలో కాలువ గట్టు శివారు పంట పొలాల్లో పిడుగుపాటుకు 14 గొర్రెలు మతి చెందాయి. కుంభ కష్ణకు చెందిన గొర్రెలను మేపుట కోసం శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లగా శుక్రవారం వర్షంతో పాటు పిడుగు పడటంతో గొర్రెలు మత్యువాతపడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలని కృష్ణ కోరుతున్నాడు.


రేపల్లెలో మృతిచెందిన గొర్రెలు

వర్షాలతో చల్లబడిన వాతావరణం

మార్కాపురం: ఇటీవల వరసగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మార్కాపురం ప్రాంతంలో వారం రోజులుగా ఏదొక ప్రాంతంలో వర్షం కురుస్తోంది. దీంతో వాతావరణం చల్లబడింది. రైతన్నలు కూడా తొలకరి ముందుగా పలుకరించిందని ఆనందంతో ఉన్నారు. ఈ ఏడాది వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందనే ఆశ కన్పిస్తోందని కొందరు రైతులు అంటున్నారు. మొన్నటి వరకు అడుగంటిన భూగర్భ జలమట్టం కొంతైనా పెరుగుతుందని ఆశిస్తున్నారు. ఇదే నెలలో వర్షాలు ఇంకా ఉంటాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో పశ్చిమ ప్రాంతంలోని కరవు రైతన్నలు సాగుకు అనుకూలంగా ఉంటుందని ఆనందంతో ఉన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించాలి

- విద్యార్థినులకు రక్షణ కల్పించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను అధికార యంత్రాంగం నియంత్రించాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో జరుగుతున్న వరుస ఘటనలపై విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడంపై ఖండిస్తూ స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు టి.ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ విద్యాలయాల్లోనే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, బాలికలకు రక్షణ లేకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ ఏకెవికె కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న మాధవరావు అనే వ్యక్తి గత నాలుగు నెలల కాలంగా విద్యార్థినులను వేధిస్తుంటే ప్రిన్సిపాల్ సైతం సహకరించడం దుర్మార్గమన్నారు. కేసు నమోదు చేసి వారం రోజులవుతున్నా నేటికీ అరెస్ట్ చేయకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్ మాట్లాడుతూ ఫీజుల విషయంలో తలెత్తిన వివాదం విద్యార్థుల తల్లిదండ్రులను చీపురులతో కొట్టుకునే వరకు వెళ్లడం దుర్మార్గమన్నారు. అధిక లాభాల కోసం ఎంతకైనా దిగజారటం తగదని, ఈ ఘటనపై డిఇఒ ప్రత్యక్షంగా పరిశీలన చేసి విఎన్‌జి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి షమ్మీ మాట్లాడుతూ తాళ్లూరు మండలం, నాగబొట్లం గ్రామంలోని ప్రైవేట్ స్కూల్లో విద్యార్థినిపై కాలేజీ యజమాని చేసిన అత్యాచార ఘటన ఆరోపణలపై డిఇఒ స్పందించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పి.రాజేంద్ర మాట్లాడుతూ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం నిబంధనలు పాటించడం లేదని, 30శాతం ఉచిత సీట్లకు ఆంక్షలు విధించి అందకుండా చేస్తున్నారన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడుతూ విద్యార్థి తల్లిదండ్రులపై దాడి చేసిన విఎన్‌జి స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు శశాంత్,హేమంత్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వినోద్

కార్ల్ మార్క్స్‌కి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక 'మంచి పుస్తకం' షాపు వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మిక వర్గ సిద్ధాంతకర్త కార్ల్‌మార్క్స్, బుద్ధుని జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత కార్ల్ మార్క్స్, బుద్ధుని చిత్ర పటాలకు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్‌రావు అధ్యక్షత వహించారు. ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రపంచ శాంతి కోసం బుద్ధుని బోధనలు, పంచ సూత్రాలను ఆచరించాలని గుర్తించడమే విశిష్టతకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి సుబ్బా రావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు జార్జి, డిహెచ్ పిఎస్ రాష్ట్ర నాయకులు కరవది సుబ్బారావు, ఎంఆర్ పిఎస్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ పాల్గొన్నారు.


కార్ల్ మార్క్స్‌కి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని మార్కాపురం శాసన సభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింత గుంట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల వైసిపి కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సర్పంచి యు.ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపిపి రామన నారాయణరెడ్డి, ఎంపిడిఓ జనార్ధన్, ఎపిఎం గోపాల్‌రెడ్డి, మండల నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, బూదాల థామస్, శ్యాంబాబు, రాగి గురవయ్య, వెంకటేశ్వరరెడ్డి, గురవారెడ్డి, మందలపు శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


గడపగడపకూ కార్యక్రమంలో కుందురు

సచివాలయ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వర రావు శుక్రవారం పేర్నమిట్ట పరిధిలోని శాంతినగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరుపట్టీ, మూమెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయా రిజిస్టర్‌లు సక్రమంగా వినియోగించకపోవడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది అంతా ఏకరూప దుస్తులు ధరించాలని ఆదేశించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న వివిధ సర్వేల గురించి చర్చించారు. సర్వేలన్నీ నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని, వాలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. సచివాలయ పరిధిలో వసూలు చేయాల్సిన యూజర్ చార్జీల గురించి చర్చించారు.


బలరాం కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్

పారిశుధ్య పనులు పరిశీలన..

పారిశుధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు శుక్రవారం మూడో డివిజన్ బలరాం కాలనీలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనుల గురించి ప్రజలతో చర్చించారు. కమిషనర్ వెంట మూడో డివిజన్ కార్పొరేటర్ ధనలక్ష్మీ, కార్పొరేషన్ సిబ్బంది ఉన్నారు.

మైనింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ప్రాంత మైనింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన చీమకుర్తి ప్రాంతంలోని గనులను, కంకర మిల్లును, విటిసి సెంటర్‌ను పరిశీలించారు. ముందుగా గంగవరం రోడ్డులోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇళ్లు కట్టుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. కాలనీ ప్రాంతంలో దొంగల బెడద ఎక్కువగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ గస్తీ పెంచాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం ఆనంద్ గ్రానైట్, మిడ్‌వెస్టు గ్రానైట్ కంపెనీలలో గనులను పరిశీలించారు. కార్మికుల పట్ల తీసుకుంటున్న భద్రతా చర్యలను, క్వారీయింగ్‌ను పరిశీలించారు. శ్రీశ్రీనివాస కంకర మిల్లును పరిశీలించారు. అనంతరం విటిసి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గనులలో పనిచేసే కార్మికులకు శిక్షణను అడిగి తెలుసుకున్నారు. 35 వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్మికుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా ఉందవద్దని గనుల యజమానులకు సూచించారు. మైనింగ్ వలన,కంకర పరిశ్రమ,పాలిషింగ్ యూనిట్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చే వారం యజమానులతో, కార్మికులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈ ప్రసాద్, ఆర్డీవో విశ్వేశ్వరరావు, గ్రానైట్ గనుల యజమానుల సంఘం కార్యదర్శి అజీమ్, యజమానులు నూనె వెంకట సుబ్రహ్మణ్యం, చలువాది బదరీనారాయణ, ఆర్‌పి రవి, ప్రతాపరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జాలారెడ్డి, కమిషనర్ ఫజులుల్లా పాల్గొన్నారు.


గ్రానైట్ రాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్